

పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో అర్హతలు కలిగిన న్యాయవాదుల నుండి జాతీయ న్యాయసేవల అధికారం రూపొందించిన 'లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్- సవరించిన పథకం 2022' ప్రకారం క్రిమినల్ వ్యవహారాలలో 'పబ్లిక్ డిఫెండర్ సిస్టమ్' తరహాలో న్యాయసహాయం, ప్రాతినిధ్యం కల్పించేందుకు చిత్తూరు జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కార్యాలయంలో పూర్తి కాలం ఒప్పంద ప్రాతిపదికన పనిచేయుటకు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ 1, డెప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ 1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన జడ్జి అరుణ సారిక మరియు డిఎల్ఎస్ఎ ఎంఎస్ భారతి కార్యదర్శి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దేశిత దరఖాస్తు ఫార్మాట్‌లో అర్హులైన న్యాయవాదులు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 12వతేదీ వరకు గడువు ఉందని, నెలవారీ గౌరవ వేతనంతో భర్తీ చేయబడతాయని, పనితీరు సంతృప్తికరంగా ఉంటే ప్రతి సంవత్సరం పొడిగింపు అవకాశం ఉంటుందని తెలిపారు. పరిజ్ఞానం, పనిలో నైపుణ్యం వంటి అర్హతలు కలిగి ఉండాలని తెలిపారు.

జిల్లాలో 59,701 పాసు పుస్తకాలు పంపిణీ

9వ తేదీ వరకు గ్రామసభలను నిర్వహించి అందజేయాలి : కలెక్టర్


గుడిపాలలో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 2 నుంచి 9వతేదీ వరకు గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గుడిపాల మండలంలో ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్ట్ కింద జరిగిన పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టాదారు పాస్‌బుక్స్ అనేది దశాబ్దాలుగా కొనసాగుతున్న కార్యక్రమమని, ఈ కార్యక్రమం నిర్వహించడానికి ప్రధాన కారణం భూ రికార్డుల వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలేనని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యక్తులు శాశ్వతం కాదు.. రైతులు, భూమి శాశ్వతం అనే ఆలోచనతో రైతులకోసం పట్టా పాస్‌బుక్స్‌ను మళ్లీ అందిస్తున్నారని తెలిపారు. ల్యాండ్ రికార్డ్స్ శాఖ తన పరిధిలో ఉండటంతో, భూమి సర్వే- రీసర్వే ప్రక్రియలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా ఉపయోగిస్తున్నామని చెప్పారు. డ్రోన్లు, రోవర్స్ ద్వారా అత్యంత కచ్చితంగా భూ హద్దులు నిర్ణయించి, రెండు నుంచి మూడు సెంటీమీటర్ల లోపే కొలతలు నమోదు చేస్తున్నామని వివరించారు. జిల్లాలోని అన్ని మండలాలు కలిపి 59,701 రాజా ముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చాయని, వీటిని 298 గ్రామాలలో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. తహశీల్దార్లు వారివారి మండలాల్లోని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేస్తారని తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకంపై వివరాలు తప్పుగా ముద్రితమైతే వాటిని పంపిణీ చేయరని తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ షెడ్యూల్ తహశీల్దార్లు ముందుగా ప్రజాప్రతినిధులకు తెలియజేసి గ్రామసభలు ఏర్పాటు చేసి మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతితులను సాదరంగా ఆహ్వానించి వారి చేతుల మీదుగా రైతులకు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. గుడిపాల మండలంలో 13గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి 4734 పట్టాదారు పాసు పుస్తకాలు రైతులకు పంపిణీ చేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో గుడిపాల మండల తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ శిరీష, మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.


వి.కోటలో..

వి కోట: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వంలోనే రైతులకు సముచితస్థానం లభిస్తుందని రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్ తెలిపారు. మండల పరిధిలోని చింతమాకులపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన రైతులకు భూహక్కు నూతన పాసుపుస్తకాలను పంపిణీ చేసే కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు రీ సర్వే పూర్తి అయిన గ్రామ పంచాయతీల పరిధిలో నూతన పాసు పుస్తకాలను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాంబాబు నాయుడు తెలిపారు. పూర్తిస్థాయిలో రీ సర్వే నిర్వహించి అన్ని పంచాయతీల పరిధిలోని రైతులకు పాస్ పుస్తకాలను దశల వారీగా పంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ ఉదయ్ సంతోష్ తెలిపారు. ముద్రందొడ్డి పిఏసిఎస్ ఛైర్మన్ హరినాథ్ రెడ్డి, స్థానిక నేతలు సతీష్ నాయుడు, బాబు, ఆర్ఐ మోహన్ రెడ్డి, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

కుప్పం: రైతుల ఆస్తులపై వ్యక్తుల ఫోటోలను ముద్రించుకోవడం అత్యంత దుర్మార్గమని.. ప్రభుత్వ రాజముద్రతో ప్రతి రైతుకు పట్టాదారు పాసుపుస్తకం అందివ్వడం జరుగుతుందని ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం పేర్కొన్నారు. మండలం కొత్తపల్లి గ్రామంలో రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. గత ప్రభుత్వ తప్పిదాల వలన రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని అయితే వాటన్నిటిని అధిగమించి రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కుప్పం మండలానికి ప్రభుత్వ రాజముద్రతో కూడిన 5500 పాసుపుస్తకాలు వచ్చినట్లు తహశీల్దార్ చిట్టిబాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ పేర్కొన్నారు. ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, మండల అధ్యక్షులు రాజుగోపాల్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.



ఎస్ఆర్.పురంలో

ఎస్ఆర్ పురం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్.ఆర్ పురం మండలంలో రీ సర్వే పూర్తయిన 4 రెవెన్యూ గ్రామాలలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ లోకనాథ పిల్లై తెలిపారు. శుక్రవారం రాజముద్రతో భూ యాజమాన్య హక్కుపత్రం, పట్టాదారు పాసు పుస్తకాలు గ్రామసభ ద్వారా రైతులకు పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, మాజీ అధ్యక్షుడు భాస్కర్ నాయుడు, రాష్ట్ర నాయకులు బాలాజీ నాయుడు, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు చొక్కామడుగు కుమార్ పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని ఆముదాల పంచాయతీలో శుక్రవారం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్, మండల అధ్యక్షుడు తాళ్లూరి శివ నాయుడు ఆదేశాలతో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ అరుల్‌నాదన్ రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు బుక్కులను రైతులకు పంపిణీ చేశారు. ఎమ్మార్వో గురవప్ప, వీఆర్వో శీను, టిడిపి నాయకులు రోసి నాయుడు, శీను మందడి, రైతులు పాల్గొన్నారు.


ఒక ఆధార్ @ మూడు కరెంట్ మీటర్లు

- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం
- నష్టపోతున్న వృద్ధదంపతులు
- రామప్ప ఆధార్‌పై 3 విద్యుత్ మీటర్లు నమోదు
- నెలకు రూ.5వేలు కరెంట్ బిల్లు


సబ్‌స్టేషన్ పడిగాపులు పడుతున్న వృద్ధ దంపతులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని గొల్లచీమలపల్లి పంచాయతీ గొల్లచీమలపల్లి గ్రామంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపేద ఎస్సీ వృద్ధుడు కే.రామప్ప తీవ్రంగా నష్టపోయాడు. ప్రభుత్వం ఎస్సీ కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా కల్పిస్తుండగా, రామప్ప ఆధార్ కార్డుపై ఏకంగా మూడు విద్యుత్ మీటర్లు నమోదు కావడంతో నెలకు రూ.6వేలకు పైగా కరెంట్ బిల్ రావడం మండలంలో తీవ్ర కలకలం రేపుతోంది. రామప్ప ఆయన భార్య ఇద్దరూ వృద్ధులు. వీరు జీవనోపాధి లేక తీవ్రఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉచిత కరెంట్ రావాల్సిన పరిస్థితిలో భారీ బిల్ రావడంతో వారు ఆందోళన చెందుతున్నారు. విషయాన్ని పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన లేకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం రామప్ప కుటుంబ సభ్యులతో కలిసి బైరెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లి అధికారులను కలిసినా ఫలితం లేకపోయిందని వాపోయారు. వృద్ధుల పరిస్థితి చూసిన స్థానికులు కూడా కదిలిపోయి, ఇది పూర్తిగా విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ మండిపడుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలు అధికారుల నిర్లక్ష్యం వల్ల పేదలకు అందడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఒకే ఆధార్‌పై మూడు మీటర్లు ఎలా నమోదు అయ్యాయనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని, తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రామప్పకు న్యాయం చేయాలని, తప్పుగా వచ్చిన విద్యుత్ బిల్లును పూర్తిగా మాఫీ చేసి వారిని ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.







గ్రామసభలో మాట్లాడుతున్న కడా పీడీ

ప్రతి గ్రామంలోనూ మౌలిక వసతులు

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలోనూ పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కడ పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. కుప్పం మండలం చెక్కునత్తంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో పీడీ వికాస్ మర్మత్, పికేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ పాల్గొన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రణాళిక అబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పీడీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, మొదలియా కార్పొరేషన్ డైరెక్టర్ మణి, మండల అధ్యక్షులు రాజుగోపాల్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, మాజీ ఎంపీపీ వెంకటేష్, క్లస్టర్ ఇంచార్జ్‌లు కన్నన్, వేడి, బాబు, కదిరిప్ప పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిశీలన



ప్రజాశక్తి -కుప్పం: కుప్పం మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను కడ పీడీ వికాస్ మర్మత్, పికేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ శుక్రవారం పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థులకు పొందుతున్న మౌలిక వసతుల గురించి వారు ఆరా తీశారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాల పని తీరును అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను ఉపాధ్యాయులు అంగన్వాడీ సిబ్బంది పీడీ దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు పీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజగోపాల్, కార్పొరేషన్ డైరెక్టర్ మణి, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, యూత్ అధ్యక్షులు కనకరాజు, రెస్కో డైరెక్టర్ మురళి, వల్లేప్ప పాల్గొన్నారు.

స్విమ్స్‌కు కేంద్ర ప్రభుత్వ నిధుల మంజూరు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

స్విమ్స్‌కు ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ పథకం కింద మైక్రోబయాలజీ విభాగం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ద్వారా ఐఆర్డిఎల్ ల్యాబ్ నిమిత్తం 8 కోట్ల 55 లక్షల 622వేల 170 రూపాయల నిధులను మంజూరు చేశారు. మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ... ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ఆరోగ్య పరిశోధన విభాగం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ద్వారా స్విమ్స్ మైక్రోబయాలజీ విభాగానికి పరిశోధన పథకానికి ప్రథమ సంవత్సర కాలపు గ్రాంట్ ఈ నిధులను వెచ్చిస్తామని తెలిపారు. స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వి కుమార్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కేటాయించిన నిధులు అంటువ్యాధి నిర్ధారణ, పరిశోధన కోసం, ఐఆర్‌డిఎల్ ల్యాబ్ మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ వైద్యులు ప్రొఫెసర్ డాక్టర్ జయప్రద, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రామక్రిష్ణ పాల్గొన్నారు.

పారదర్శకంగా అనుమతులు మంజూరు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పారదర్శకంగా అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి అవకాశాల పెంపులో భాగంగా పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమలశాఖ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన నిమిత్తం వారికి అవసరమైన నైపుణ్యాల పెంపునకు చర్యలు చేపట్టడంలో భాగంగా జిల్లాలో గల పరిశ్రమలకు అవసరమైన శిక్షణ కలిగిన సిబ్బంది నిమిత్తం సంబంధిత పరిశ్రమలతో సమన్వయం చేసుకుని, డిఆర్‌డిఏ, పశుసంవర్ధక శాఖ, మెప్మా అధికారుల సమన్వయంతో మండల, డివిజన్ స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించుకోవాలని జిల్లా పరిశ్రమల అధికారిని ఆదేశించారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూ కేటాయింపులు త్వరితగతిన మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ (పిఎంఈజీపి) పథకాల దరఖాస్తులను తక్షణం పరిష్కరించి రుణాలు మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా యూనిట్లు కూడా గ్రౌండ్ అయ్యేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కుప్పం, పలమనేరు, వీకోట, ఇతర మండలాలలో పాడి పరిశ్రమ, గ్రానైట్ పరిశ్రమపై ప్రజలు జీవన ప్రమాణాలు పెంచాలని తెలిపారు. నగిరి పవర్లూమ్స్ ఎక్కువగా ఉన్నాయని అక్కడ ప్రజలు అనుసరించి పరిశ్రమల నెలకొల్పడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు, పూతలపట్టులో ధనరాజుపల్లిలో పరిశ్రమలు విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సూరిబాబు, జెడ్ఎం సుబ్బారావు, ఎల్‌డిఎం హరీష్, ఎస్పీడీసీఎల్ ఎస్సీ ఈ ఇస్మాయిల్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి గుణభూషణ్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, గ్రౌండ్ వాటర్ అధికారి గోవర్ధన్ రెడ్డి, డిస్టిక్ ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, మార్కెటింగ్ ఏడి పరమేశ్వరన్, ఎస్ఎస్‌సిసిఐ ప్రతినిధి డేవిడ్ పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్



రాష్ట్రకమిటీ పిలుపు మేరకు 104లో ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్‌లో అన్ని జిల్లాలో సీఐటీయూ కార్యాలయంలో 104 జిల్లా గౌరవ అధ్యక్షుడు గంగరాజు ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల అఖిలపక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. భవ్య యాజమాన్యం 104 ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేస్తుందని, ఉద్యోగులకు సమస్యలు పెరిగిపోయాయని, ఎన్నిసార్లు యాజమాన్యంని కలిసి సమస్యలు పరిస్కారం కోసం ప్రయత్నం చేసినా ఫలించలేదని గంగరాజు అన్నారు. కావున తప్పని పరిస్థితిల్లో 104 ఉద్యోగులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. డిసెంబర్ 19వ తేదీ నుండి జనవరి 2026వ తేదీ వరకు ముందస్తు నోటీసు జారీ చేసి వివిధ రూపాల్లో తమ నిరసన కార్యక్రమాలు చేస్తున్నా సమస్యలు పరిస్కారం కాకపోతే మరింత ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియచేస్తున్నామన్నారు. ఈనిరసన కార్యక్రమాలులో భాగంగా జిల్లా సీఐటీయూ కార్యాలయంలో అన్నీ సీఐటీయూ అనుబంధ సంఘాలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా, 104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు విఠల్ మాట్లాడుతూ భవ్య యాజమాన్యం తగ్గించిన వేతనాలు సవరించి పూర్తి వేతనాలు చెల్లించాలని దానితో పాటుగా ప్రభుత్వం కూడా జీతాలు పెంచే ఆలోచన చెయ్యాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మణికంఠ మాట్లాడుతూ తొలగించిన క్యాజువల్ లీవులు పునారిద్ధరించాలి అన్ని ప్రభుత్వ సెలవు 104కి కూడా వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ మాట్లాడుతూ తొలగించిన బఫర్ సిబ్బందిని తిరిగి నియమించి ఉద్యోగుల మీద పనిఒత్తిడి తగ్గించాలని, ఇప్పుడున్న పూల్ విధానం సరి అయింది కాదు కావున పునరాలోచన చేయాలన్నారు. భాస్కర్ మాట్లాడుతు 104లో పనిచేస్తూ 5 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న డ్రైవర్‌లకు స్లాబ్ అమలుకి చర్యలు తీసుకోవాలన్నారు. భవ్య యాజమాన్యం 104 సమస్యలపై ప్రశ్నించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీద అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని లేకపోతే ఉద్యమం మరింత తీవ్ర తరం చేస్తామని అన్నారు. 104 ఎంప్లాయిస్‌తో పాటు 108 జిల్లా నాయకుడు లక్ష్మీనారాయణ, 102 జిల్లా నాయకుడు నాగరాజు పాల్గొన్నారు.

సంజీవని పథకం పేదలకు వరం : డిఎం అండ్ హెచ్ఓ


సమావేశంలో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుధారాణి

ప్రజాశక్తి- వి కోట: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే సంజీవిని పథకం పేద ప్రజలకు గొప్ప వరమని చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఓగు పిహెచ్‌సిలో శుక్రవారం అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జిల్లాలో సంజీవిని కార్యక్రమం ప్రారంభం కానునందన్నారు. 18 సంవత్సరాలు పైబడిన జనాభా అంతటికి అబ ఐడి క్రియేషన్, పనిచేసే మొబైల్ నెంబర్ అందరికీ యాప్‌లో ఎంటర్ చేయాలన్నారు. తద్వారా అనారోగ్య బాధితులకు రక్త పరీక్షలు, ఎక్స్రేలు, మందులు అన్ని రిపోర్ట్స్ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్లో సేవ్ చేయబడతాయన్నారు. రాబోవు కాలంలో నమోదైన వారిలో ఎవరికైనా ఏదైనా ఇబ్బంది సంభవిస్తే సులభంగా చికిత్స చేయవచ్చున్నారు. అలాగే ఆర్‌సిహెచ్ యాప్, ఏఎన్ఎం యాప్, ఎన్‌సిడి 4.0 సర్వే, హెచ్ఎంఐఎస్, హైజిన్, ఐహెచ్ఐపి యాప్‌లు, యు విన్, మిగతా అన్నింటినీ ప్రతిరోజు అప్డేటెడ్‌గా 100శాతం పూర్తి చేయాలన్నారు. ఎవరైనా పెండింగ్ ఉంటే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఏఎన్ఎం ఆన్లైన్ రిపోర్ట్‌ను వారి రికార్డులతో ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉప వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, డాక్టర్ ప్రవీణ, జార్జ్, శ్రీవాణి, రామ్మోహన్, డీఈఓలు, వైద్యులు, సూపర్వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

విధులలో అలసత్వం వహిస్తే ఉపేక్షించం: కలెక్టర్


గుడిపాల పిహెచ్‌సిలో తనిఖీలు నిర్వహిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల సేవాభావంతో వ్యవహరించాలని, ఆసుపత్రి ఆవరణం పరిశుభ్రంగా ఉంచాలని, విధుల నిర్వహణలో అసత్వం వహిస్తే ఉపేక్షించమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం స్థానిక గుడిపాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్సీలోని అన్ని విభాగాలను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా సంజీవని కార్యక్రమంపై ఓపీ, కంప్యూటరైజ్డ్ డేటాను పరిశీలించారు. రోగులకు ఇచ్చే మందులు వివరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. లాగిన్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని వైద్యసిబ్బందిని హెచ్చరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ ఆసుపత్రి కావలసిన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. వైద్య సిబ్బంది విధులలో అలసత్యం వహిస్తే ఉపేక్షించం జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సిహెచ్ఓ సూర్యనారాయణ, విజయ్, వెంకటేష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బౌల్డరింగ్ ఫెస్టివల్ ఏర్పాట్లను పరిశీలించిన పీడీ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం మండలం కంగుందిలో ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు జరిగే బౌల్డింగ్ ఫెస్టివల్ ఏర్పాట్లను కడ పీడీ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం శుక్రవారం పరిశీలించారు. ఫెస్టివల్ నిర్వహణకు ఎంపిక చేసిన ప్రదేశం, భద్రతా చర్యలు, రాకపోకల సౌకర్యాలు, తాగునీరు, విద్యుత్, వైద్యసదుపాయాలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. పర్యాటకులు, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ శ్రీనివాసరాజు, ఎఫ్ఆర్ఓ జయశంకర్, సర్పంచ్ ధనశేఖర్, అగ్రికల్చర్ ఏడీ పల్లవి, మంజునాథ్,పాల్గొన్నారు.

కామ్రేడ్ ఎబి.బర్ధన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

సిపిఐ అగ్రనేత మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎ.బి.బర్ధన్ 10వ వర్ధంతి సందర్భంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యాలయంలో బర్ధన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ మతసామరస్యం కోసం లౌకిక రాజ్యాంగ పరిరక్షణకు శ్రామికుల కోసం కృషి చేసిన గొప్ప కమ్యూనిస్టు నేత ఎ.బి.బర్ధన్ అని కొనియాడారు. ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన బర్ధన్ కార్మికులు, కర్షకులు, అట్టడుగు అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతికి జీవితాంతం ఎనలేని కృషి చేశారన్నారు. సిపిఐ నగర కార్యదర్శి విసి.గోపినాథ్, నాయకులు కె.మణి, కె.విజయగౌరీ, దాసరిచంద్ర, ఎ.జమీలాబీ, బి.కుమారి, పి.రఘు, హెచ్.బాలాజీ రావు, పి.గజేంద్ర బాబు పాల్గొన్నారు.

పట్టా పాస్ బుక్‌లు పంపిణీ


పట్టాపాస్ బుక్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: రైతులకు పారదర్శకంగా పట్టా పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ అన్నారు. శుక్రవారం గంగాధర నెల్లూరు మండలం నెల్లేపల్లి పంచాయతీలో రైతులకు పట్టాపాసు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో ఉన్న పాస్‌బుక్‌ను అందించడంతో రైతులు మోసపోయారన్నారు. నేటి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో రాజముద్రతో కూడిన పట్టా పాసు బుక్‌లు పంపిణీ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ ఏకాంబరం, వీఆర్‌వో సుబ్రహ్మణ్యం, వెల్ఫేర్ అసిస్టెంట్ మాధవి , కిషోర్ పాల్గొన్నారు.

తవణంపల్లి: మండలం పుణ్యసముద్రంలో రీ సర్వే ప్రారంభానికి శుక్రవారం భూమి పూజ ఘనంగా నిర్వహించారు. తహశీల్దారు ఎస్ మాధవ రాజు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, రైతుల సమక్షంలో గ్రామ సభలు నిర్వహించి ఈ కార్యక్రమం చేపట్టారు. దిగువ మాఘం గ్రామంలో పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ నిర్వహించారు. మొత్తం 321 పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు కాగా, ఈ సందర్భంగా 50 పాస్‌పుస్తకాలను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎస్ మాధవ రాజు, సర్వేయర్ మురళి, ఆర్ఐ జీవన్, వీఆర్ఓ వెంకట మునికుమార్, ఎంపీటీసీ, సర్పంచ్ గోపి, వైస్ సర్పంచ్ శ్రీధర్ నాయుడు, వీఆర్ఓ వెంకటరమణ, వీఆర్ఏ మోహన్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది, ఎంపీటీసీలు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీపురం సీతారామయ్య

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ పారిశుద్ధ్య కార్మికులకు నూతన సంవత్సర సందర్భంగా శ్రీపురం సీతా రామయ్య దుస్తులు(చీరలు) శుక్రవారం పంపిణీ చేశారు. పలమనేరు పురపాలక సంఘ కార్యాలయంలో పలమనేరు నాగమణి శ్రీపురం సీతారామయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాదాపు 30 మంది మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీపురం సీతారామయ్య మాట్లాడుతూ ఎండ, గాలి, చలి, వర్షానికి సైతం లెక్క చేయక పలమనేరు పుర ప్రజలకు మహిళా పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు మరువ లేనివన్నారు. పలమనేరు పురపాలక సంఘ సిబ్బంది సమిష్టి కృషి వల్లే మున్సిపాల్టీకి స్వచ్ఛత అవార్డు వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి, శ్రీపురం సీతారామయ్య, ఎల్లంపల్లి నరేంద్ర, ఎం సునీల్ రాథోర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి
తహశీల్దారుకు వినతి


తహశీల్దారుకు సమస్యలు వివరిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని బల్ల గ్రామపంచాయతీలో గత నెల 31న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ విలువలబడి నిర్వహించిన సందర్భంగా గ్రామ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. వాటిని వెంటనే పరిష్కరించాలని టిడిపి మండల అధ్యక్షుడు వెంకట రమణ స్థానిక టిడిపి నేతలతో కలిసి తహశీల్దారు కొలెక్షన్ బల్ల సమస్యలను శుక్రవారం వివరించారు. ఆరిమానిపెంట నుంచి గోవిందపల్లి మీదుగా రోడ్డు బుదుగుడు వరకు డబుల్ రోడ్డు వేయాలన్నారు. హై స్కూల్లో అసంపూర్తిగా ఉన్న ప్రహరీ గోడను పూర్తి చేయాలన్నారు. అదనపు గదులు కూడా ఏర్పాటుకు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, సింగిల్ విండో చైర్మన్ మహమ్మద్ రఫీ, సురేష్, పాల్గొన్నారు.

ఈ సైకిల్స్‌పై అవగాహన



ప్రజాశక్తి-కుప్పం: కుప్పం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవతో సబ్సిడీ పై ఈ సైకిళ్లను అందిస్తున్నామని కౌన్సిలర్ జాకీర్, వన్నె కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం పేర్కొన్నారు. కుప్పం మున్సిపాలిటీ మాదల సచివాలయంలో ఈ సైకిల్‌పై ప్రజలకు అవగాహన నిర్వహించారు. రూ.5 వేలు చెల్లించి ఈ సైకిల్ బుక్ చేసుకుంటే సులభతరా డబ్బులు చెల్లించుకోవచ్చన్నారు. నియోజక వర్గంలోని ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా సబ్సిడీ పై అందిస్తున్న ఈ సైకిల్ లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌ఛార్జి లోకేష్ , నాయుడు,ప్రసాద్ , సురేష్, పాల్గొన్నారు.

పొన్న యుగంధర్‌కు పలువురు శుభాకాంక్షలు

ప్రజాశక్తి -కార్వేటినగరం: నగరి మండలం జనసేన నాయకులు ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్, జనసేన జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ యుగంధర్ పొన్నను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన టౌన్ ప్రెసిడెంట్ రాజేష్, నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ వెంకటేష్, టౌన్ ఉపాధ్యక్షులు సూర్య నరసింహులు, ప్రధాన కార్యదర్శి మణికంఠ, పవన్ కళ్యాణ్ వీరాభిమాని రాజేంద్ర, మండల జనరల్ సెక్రెటరీ నాగార్జున మునగ వంక చెరువు చైర్మన్ మణి పలువురు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వివిధ పంటలపై రైతులకు మండల వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. మండలంలోని వేణుగోపాలపురంలో రైతులకు పెరటి తోటల పెంపకానికి అవసరమైన కూరగాయల విత్తనాలు, యూరియా ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువు ఆక్సోఫాస్ ను రైతులకు శుక్రవారం ఉచితంగా సరఫరా చేశారు. ఈ సందర్భంగా కెవికే డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ అధిక మోతాదులో యూరియాను వాడుకోకుండా భూసార పరీక్షల ఆనుసరించి కావలసిన మోతాదులో మాత్రమే వాడాలని తెలిపారు. ఆక్సోఫాస్ ను వాడే పద్ధతులను రైతు పొలాలలో రైతులకు ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వనరుల శిక్షణ కేంద్రం నుండి సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీ ప్రసన్న , మండల వ్యవసాయ అధికారి వనిత, వేణుగోపాల పురం టిడిపి మార్కెట్ కమిటీ చైర్మన్ రవి , రైతు సేవా కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పలమనేరు రూరల్ (గంగవరం): గంగవరం మండలం మదర్ థెరిసా విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్ కళాశాల విభాగంలో చదువుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమం పలమనేరు ఏరియా ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో మొత్తం 55 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్లు అకాడమీ అధికారి రాజేంద్రరెడ్డి తెలిపారు. ఈ రక్తాన్ని జిల్లా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌కు తరలించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బందితో పాటు కళాశాల యాజమాన్యం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగిన ప్రభుత్వ భవన నిర్మాణాలు

- ప్రజాధనం వృథా
- శిథిలావస్థలో భవనాలు
- స్పందించని అధికారులు



ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలం ఆలపల్లి గ్రామ పంచాయతీ కేంద్రంలో ప్రభుత్వ సౌకర్యాల కోసం నిర్మాణం చేపట్టిన సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్ర భవనాలు నేడు అర్ధాంతరంగా నిలిచిపోయి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కోట్ల రూపాయల ప్రజాధనంతో చేపట్టిన ఈ నిర్మాణాలు ప్రజలకు ఉపయోగపడకుండానే నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

గ్రామానికి సుమారు అర్ధ కిలోమీటర్ దూరంలో, జనావాసాలకు దూరంగా ఈ భవనాల నిర్మాణం చేపట్టడమే వివాదాస్పదంగా మారింది. సరైన ప్రణాళిక లేకుండా, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా చేపట్టిన ఈ నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోవడంతో నేడు అవి పిచ్చిమొక్కలతో నిండిపోయి శిథిలంగా మారుతున్నాయి.

ఈ భవనాల నిర్మాణానికి ఎంత మొత్తంలో నిధులు కేటాయించారనే విషయంపై అధికారిక సమాచారం లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటివరకు ఎంత మొత్తం ఖర్చు చేశారు? ఇంకా ఎంత ఖర్చు చేయాల్సి ఉంది? అన్న వివరాలను అధికారులు, ప్రజాప్రతినిధులు వెల్లడించకపోవడం గమనార్హం. దీనివల్ల ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఇవే భవనాలు పూర్తయి వినియోగంలోకి వస్తే పరిసర గ్రామాల ప్రజలకు సచివాలయ సేవలు, వైద్య సదుపాయాలు, రైతులకు అవసరమైన సేవలు అందుబాటులోకి వచ్చేవి. కానీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఆశించిన ప్రయోజనం ఏ మాత్రం చేకూరడం లేదు.

ప్రజల ప్రయోజనాల కోసం కేటాయించిన నిధులు ఇలా వృథాగా మారడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి, భవనాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, నిధుల వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఈ నిర్మాణాలు ప్రజాసేవకు కాదని, నిధుల దుర్వినియోగానికి ప్రతీకలుగా మిగిలిపోతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఓం శక్తి భక్తులకు ఆర్థిక సాయం


ఓం శక్తి భక్తులకు ఆర్థిక సాయం అందిస్తున్న దాత

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: తీర్థం పంచాయతీ సింగిల్ విండో డైరెక్టర్ విశ్వనాథ్ ఓం శక్తి భక్తులకు శుక్రవారం ఆర్థిక సాయం అందించి ఉదారతను చాటుకున్నారు. ఓం శక్తి అమ్మవారి దర్శనానికి గ్రామం నుంచి వెళ్లే మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన ఆయన, వారి భోజన ఖర్చుల నిమిత్తం తన స్వంత నిధుల నుంచి రూ.10,116 రూపాయలు అందించి ఆదర్శంగా నిలిచారు. అంతకు ముందు ప్రతి ఏడాది మహిళల కోసం ఉచిత బస్సులు ఏర్పా టు చేస్తూ సహకారం అందించిన విశ్వనాథ్ ఈసారి ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. తన వంతు సేవగా భోజన ఖర్చుల కోసం నగదు సాయం అందిం చారు. భక్తులు దాతకు అభినందనలు తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన


తవణంపల్లెలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- తవణంపల్లె: తవణంపల్లి మండలం గాజులపల్లిలో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా విస్తృత స్థాయిలో ప్రజలకు అవగాహన తవణంపల్లె ఎస్ఐ డాక్టర్ హెచ్ నాయక్ శుక్రవారం అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండడం, వాహన ఇన్సూరెన్స్ చేయించుకోవడం వంటి అంశాలపై ఎస్ఐ ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండటం ద్వారా తమ ప్రాణాలను కాపాడుకోవచ్చని అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాల గురించి వివరించారు. బాల్య వివాహాలు వంటి సామాజిక దురాచారాలను నిర్మూలించాలని, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ ఫ్రాడ్‌ల నుంచి ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లె పోలీస్ స్టేషన్ ఎస్సై డాక్టర్ హెచ్ నాయక్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు: రోడ్డు భద్రతా నియమాలపై అవగాహనలో భాగంగా పలమనేరు పట్టణంలో పలమనేరు సబ్ డివిజన్ డిఎస్పీ డేగల ప్రభాకర్, పలమనేరు మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ ప్రజలకు హెల్మెట్ వితరణ చేశారు. అనంతరం భారీ ఎత్తున పట్టణంలో హెల్మెట్ ధారణపై 250 మందితో బైక్ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

చిత్తూరు అర్బన్: ఏపీఎస్ఆర్టీసీ టు డిపోలో హెల్మెట్ ధారణ, రోడ్డు భద్రతా నియమాలు , బస్సు, ఇతర వాహనాలు నడిపే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ సాయినాథ్, ట్రాఫిక్ ఎస్ఐ త్యాగరాజు, ఏపీఎస్ఆర్టీసీ 1 డిపో ఆర్ఎం , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రూ.23 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం



ప్రజాశక్తి - రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల గ్రామ పంచాయతీలోని రైతు సేవా కేంద్రం నుంచి టీటీడీ కళ్యాణ మండపం వరకు నూతనం గా 23 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సిమెంటు రోడ్డు ఏర్పాటు చేస్తున్నామని ఆర్అండ్‌బి డిఈ వెంకటయ్య శుక్రవారం తెలిపారు. రెండు నెలల క్రితం కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా పాడైపోయి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ప్రజల రవాణా సౌకర్యాలకు ప్రయాణం కష్టంగా ఉండడంతో ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, ఈవో సత్యం రెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులు చేపట్టినట్లు డిఈ తెలిపారు. రోడ్డు ఏర్పాటుతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న ద్రావిడ విశ్వవిద్యాలయ విసి

ప్రజాశక్తి-గుడిపల్లి: కర్ణాటకలో హెచ్ఎన్ అవార్డు 2025ను పొందిన ద్రావిడ విశ్వవిద్యాలయంలోని కన్నడ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎస్ దుర్గా ప్రవీణ్‌ను ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం దొరస్వామి , రిజిస్ట్రార్ ఆచార్య వి కిరణ్‌కుమార్ వారి ఛాంబర్‌లో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ద్రావిడ విశ్వ విద్యాలయంలో కర్ణాటక స్టేట్ సైంటిఫిక్ రీసెర్చ్ కౌన్సిల్, కర్ణాటకకు చెందిన ప్రముఖ విద్యావేత్త, అభ్యుదయ వాది, మాజీ ఉపకులపతి, డాక్టర్ హెచ్ నరసింహయ్య జ్ఞాపకార్థం హెచ్ఎన్ అవార్డు 2025ను ద్రావిడ విశ్వవిద్యాలయ కన్నడ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం ఎస్ దుర్గా ప్రవీణ్ అందుకున్నారు. ఆయన విద్యారంగంలో చేసిన సేవకు కర్ణాటక ప్రభుత్వ పరిశ్రమల శాఖ మంత్రి శరణబసప్ప దర్శనాపుర ఐదు రాష్ట్రాల సైన్స్ కాన్ఫరెన్సు సందర్భంగా కర్ణాటకలో ఆయనకు ఈ అవార్డును అందించారు. ఈ నేపథ్యంలో అవార్డు గ్రహీత డాక్టర్ ఎంఎస్ దుర్గాప్రవీణ్‌ను ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య వి కిరణ్ కుమార్ వారి ఛాంబర్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ అవార్డు ప్రదానం చేసిన వారిని ప్రశంసిస్తూ ఆ సంస్థకు చెందిన డాక్టర్ హులికల్ నటరాజ, విద్యా, వైజ్ఞానాన్ని పెంపొందించే విధంగా ఆయన చేస్తున్న సేవలను అభినందించారు.

పారిశుధ్యంపై శ్రద్ధ వహించండి: ఎంపీడీవో

ప్రజాశక్తి-సోమల: మండలంలోని అన్ని పంచాయతీలలో పంచాయతీ పరిధిలోని గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించి పారిశుధ్య పనులు చేయించాలని ఎంపీడీవో సివిఎస్‌వి ప్రసాద్ అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు మిఠాయిలు తీసుకువచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన కార్యదర్శులతో సమీక్ష నిర్వహించి ప్రభుత్వం అందించిన సర్వే కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా గ్రామాలలో ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదా ఎంతో లాభదాయకం : డీఈ



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: విద్యుత్ ఆదా ఎంతో లాభదాయకమని గంగాధర నెల్లూరు విద్యుత్ శాఖ డీఈ శేషాద్రి రెడ్డి అన్నారు. మండలంలోని తూగుండ్రం పంచాయతీ తూగుండ్రం దళితవాడలో కరెంటోళ్ల జన బాటను శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా లూజుగా ఉన్న లైన్లను సర్దుబాటు చేయడం, చెట్లను నరికి వేయడం, దెబ్బతిన్న స్తంభాలు, దెబ్బతిన్న కేబుల్స్, చిన్న స్తంభాలను గుర్తించడం, వంటి కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. విద్యుత్ సమస్యలు ప్రజలకు ఏమైనా ఉంటే త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిఎన్‌టియూసీ అధికార ప్రతినిధి జీవరత్నం, విద్యుత్ శాఖ ఏఈలు జీడి నెల్లూరు వరదరాజులు, ఆవల కొండ తనిగవేలు, పాలసముద్రం ఏఈ లోకేష్‌రెడ్డి, ఎల్ఎంలు సుబ్రహ్మణ్యం, సుమతి, గజేంద్ర, గురుమూర్తి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కర్ణ, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.


నిరసన చేపట్టిన అఖిలపక్ష నాయకులు

కార్వేటినగరాన్ని తిరుపతిలో కలపాలి

ప్రజాశక్తి -వెదురుకుప్పం: కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలిపే వరకు తమ పోరాటం ఆగ దని అఖిల పక్షనాయకులు అన్నారు. మండల కేంద్రంలోని గాండ్ల మిట్ట కూడలిలో గురువారం అఖిల పక్ష నాయకులు చేపట్టిన శాంతియుత నిరసన కార్యక్రమం శుక్రవారం కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు కార్వేటినగరంలో గతంలో పర్యటన సమయంలో కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలను తిరుపతి జిల్లాలో కలిపే బాధ్యత టీడీపీ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారని, నారా లోకేష్ యువగళం పాదయాత్రలోనూ హామీ ఇచ్చారని ప్రస్తుతం దాన్ని నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, రవికుమార్, పర్వేజ్, గాజుల నరసింహులు, హరికృష్ణ, జగన్నాధం, పలువురు పాల్గొన్నారు.

జనవాణి సమస్యలు పరిష్కరించండి..


అన్నమయ్య కలెక్టర్‌ను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు పట్టణంలో జనసేన ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు గుర్తించేందుకు నిర్వహిస్తున్న 'జనవాణి'లో వచ్చే సమస్యలు పరిష్కరించి సహకరించాలని అన్నమయ్య కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను శుక్రవారం కోరారు. కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా మదనపల్లి కేంద్రంగా జిల్లా కలెక్టర్‌ను, డీఎస్పీ మహేందర్‌ను సీనియర్ నాయకులు, రాయలసీమ కో కన్వీనర్, మదనపల్లి ఇన్‌చార్జ్ రాందాస్ చౌదరితో కలిసి శుక్రవారం వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారు లతో మాట్లాడుతూ ప్రతి సోమవారం పుంగనూరులో జనవాణి నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంపై పలు సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని వాటిని పరిష్క రించేందుకు అధికారులు సహకరించాలన్నారు. రాందాస్ చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో జనసేనకు ప్రాధా న్యత కల్పిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బెజవాడ దినేష్ , తంబళ్లపల్లె ఇన్‌ఛార్జి పోతుల సాయినాథ్ , మద న పల్లి ఏయంసి కమిటీ చైర్మెన్ జంగాల శివరామ్ , రాష్ట్ర చేనేత కార్యదర్శి అడపా సురేందర్ , సీనియర్ నాయకులు తోట కల్యాణ్ , ఐటీ కో ఆర్డినేటర్ లక్ష్మీ నారాయణ, వీర మహిళలు, జనసేన నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి- రామకుప్పం: మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లో ఎన్టీఆర్ భరోసా నూతన పెన్షన్‌ను టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ సర్పంచ్ సీతాపతి పంపిణీ శుక్రవారం చేశారు. మైనార్టీ మహిళలు మునిరా, అబిదా బేగం భర్తలు ఇటీవల మృతి చెందారు. దీంతో స్థానిక నాయకుల చొరవతో కూటమి ప్రభుత్వం ద్వారా వితంతు పెన్షన్లను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మండల అధ్యక్షుడు ఎస్కే ఆదిల్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి గణేష్ నాయుడు, ఐ టీడీపీ మాజీ అధ్యక్షుడు సురేష్, బూత్ ఇన్‌ఛార్జిలు చాంద్ భాషా, నిసార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ప్రజాశక్తి -కార్వేటినగరం: మండల పరిధిలోని డిఎంపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గోవిందరాజులు తమ్ముడు చిన్ని ప్రమాదానికి గురై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ తన అన్న విఎం రాజన్‌కు ఫోన్ ద్వారా మాట్లాడి చిన్నికి ఆర్థికసాయం చేయాలని సూచించారు. అనంతరం విఎం రాజన్ చిన్నికి రూ. 6,500 ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ చిన్నిని అన్ని విధాలుగా ఆదుకుంటారని తెలిపారు. టీడీపి ప్రభుత్వంలో ప్రజలకు నిత్యం అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు వెళుతోందన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జిడి నెల్లూరు అభివృద్ధి దిశగా పనిచేస్తున్నారని, రాబోయే రోజుల్లో జిడి నెల్లూరు నియోజకవర్గంలో ఉద్యోగాలతో చరిత్ర లిఖించనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మండల అధ్యక్షులు జంగ్రాయ యాదవ్, సోమశేఖర్, హేమంత్ రెడ్డి, పొద్దుటూరు రాజా, మునికృష్ణ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అంకిత భావంతో పనిచేయాలి

ప్రజాశక్తి- కార్వేటినగరం: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు అంకిత భావంతో పని చేయాలని ఎంఈవో ఎం విజయకుమార్ అన్నారు. శుక్రవారం ఎమ్మార్సీ భవనం ఆవరణలో ఎస్టీయూ డైరీ, క్యాలెండర్లు ఎంఈవోలు విజయకుమార్, మనోజ్‌కుమార్‌లు ఎస్టీయూ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో విజయకుమార్ మాట్లాడుతూ మండల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలతో పాటు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అంకిత భావంతో పని చేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు హేమ చంద్రారెడ్డి, యువరాజు, వెంకటేశులు, ఆటుకారు చంద్రశేఖర్, నాగేంద్రరాజు, జిల్లా నాయకులు సుబ్రహ్మణ్య యాదవ్, పురుషోత్తం, సర్దార్, అమర్నాథ్ రీటమ్మ, పరందామ, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివశంకర్ సురేష్, ఆర్థిక కార్యదర్శి కార్తీక్ పలువురు పాల్గొన్నారు.

భూ సమస్యలు లేని మండలంగా కార్వేటినగరం: తహశీల్దారు

ప్రజాశక్తి- కార్వేటినగరం: రైతులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసమే రీ సర్వే అమలు చేస్తోందని తహశీల్దారు కే నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆర్‌కెవిబి పేటలో నాలుగో విడత రీ సర్వే నిర్వహిస్తున్న నాలుగు రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల ర్యాలీలో తహశీల్దారు పాల్గొని ప్రసంగిం చారు. మండలం లోని బట్టువారిపల్లి, ఆర్ కే వి బి పేట, గోపిశెట్టిపల్లి, ఎర్రమరాజుపల్లి నాలుగు గ్రామాల్లో నాలుగో విడత రి సర్వే ప్రారంభించి సర్వే టీం తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలు సర్వేయర్లతో రీ సర్వేపై అవగాహన కల్పించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. గ్రామాల్లోని రైతులందరితో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి అందరికీ నోటీసులు సర్వ్ చేసి వారికి అవగాహన కల్పించిన తర్వాతే గ్రౌండ్ ట్రూతింగ్ చేయాలన్నారు. నేషనల్ ఖాతాలో ఉన్న రైతులు నుండి అన్ని డాక్యుమెంట్లను తీసుకోవాలని రైతులందరికీ అనుగుణంగా వారి అభిప్రాయాలు మేరకు అభ్యంతరాలు లేకుండా అందరికీ తెలిపి గ్రౌండ్ ట్రూత్కింగ్ చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చేందుకు రీ సర్వేలో ప్రతి ఒక్కరు చురుగ్గా పాల్గొని పొరబాట్లు లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకుని పక్కాగా రీ సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తాసిల్దారులు లోకేష్ యాదవ్ స్వరూప రాణి సర్వేయర్ మార్ కొండయ్య నరసింహులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధునికి సన్మానం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: శతాధిక వృద్ధుడికి మండల కేంద్రంలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఎస్‌టిఓ ప్రసన్న రాణి ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌టిఓ ప్రసన్న రాణి మాట్లాడుతూ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న విశ్రాంతి ఉద్యోగికి సన్మానించడం అందరి బాధ్యత అన్నారు. 1924 లో జన్మించిన పరశురామారెడ్డి 1984లో ఉద్యోగ విరమణ పొందారని, అప్పటినుండి బంగారు పాలెం సబ్ ట్రెజరీ కార్యాలయం నుండి ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ప్రభుత్వం నుండి అందుతున్న పెన్షన్ ఖాతాదారుడుగా కొనసాగుతున్నాడడని, అతనిని గుర్తించి అభినందించడం అందరి బాధ్యత అన్నారు. శత సంవత్సరాలు పూర్తి చేసుకున్న వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పెన్షనర్స్ అధ్యక్షులు కృష్ణయ్య , విశ్రాంతి ఉపాధ్యాయులు చంద్రం, విశ్వనాథ్, భాస్కర్, కృష్ణారెడ్డి, పలువురు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి- పలమనేరు: వంద రోజుల యాక్షన్ ప్లాన్, ముస్తాబు కార్యక్రమాలలో భాగంగా కమిషనర్ ఎన్వి రమణా రెడ్డి, నోడల్ ఆఫీసర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 10వ తరగతి ఉత్తమ ఫలితాల సాధనకు వంద రోజుల ప్రణాళిక, కార్యాచరణను నిర్దేశించిందని తెలిపారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మృతిచెందిన సురేష్‌కుమార్

ప్రజాశక్తి- తవణంపల్లి: రోడ్డు ప్రమా దం లో యువకుడు మృతి చెందిన సంఘటన తవణంపల్లి - అరగొండ మార్గంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కడపజిల్లా పోరుమామిళ్ల మండలం ఎల్లవపల్లెకు చెందిన వంకరాజు సుధాకర్ కుమారుడు సురేష్ కుమార్ (21) చిత్తూరు ఎస్‌వి సెట్ కాలేజీలో చదువు తున్నాడు. సురేష్ కుమార్ శుక్రవారం ఉదయం 12.40 -6.40 గంటల మధ్య సమయంలో రిజిస్ట్రేషన్ నెంబరు ఎపి04 బీవీ 5466 నెంబరు కలిగిన బైక్‌లో తవణంపల్లె మండలం, చిత్తూరు-అరగొండ రోడ్డులో వినాయక స్కూలు సమీపంలో నిర్లక్ష్యంగా, వేగంగా నడుపుతూ రోడ్డుపక్కనే వున్న చిన్న దుకాణాన్ని ఢీకొన్నాడు. ఫలితంగా అతని ముక్కు, చెవులో, కుడి కాలికి బలమైన గాయా లయ్యాయి. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ డాక్టర్ నాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత
ఒకరు పరారీ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: సిఐ ఆదేశాల మేరకు ముందస్తు సమాచారం అందడంతో బైరెడ్డిపల్లి మండల కేంద్రంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది వాసు, గణేష్‌లు శుక్రవారం సాయంత్రం సెంటర్ బస్టాండ్ వద్ద విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో తమిళనాడుకు చెందిన జుపిటర్ ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. అక్కడ ఉన్న పోలీసులను గమనించిన వెంటనే వాహనంతో పరారయ్యేందుకు యత్నించగా, పిసి సుబ్రహ్మణ్యం వాహనాన్ని వెంబడించారు. ఇది గమనించిన ఓ వ్యక్తి గోడ దూకి పరారయ్యాడు. మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో కర్ణాటకకు చెందిన మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. వాటి విలువ సుమారు ?12 వేల వరకు ఉండవచ్చని స్థానికులు అంచనా వేస్తున్నారు. పోలీసుల విచారణలో వాహనం నడుపుతున్న వ్యక్తిని తమిళనాడు ఆంబూర్‌కు చెందిన మహేష్‌గా గుర్తించారు. కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పరారైన వ్యక్తిని పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటనతో బైరెడ్డిపల్లి మండలంలో అక్రమ మద్యం తరలింపుపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని ప్రజలు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి -బంగారుపాలెం: గుర్తు తెలియని ఓ అనాథ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుకుంది. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు మండలములోని బలిజిపల్లి వద్ద అనాథ అనారోగ్యంతో ఉన్న 65 సంవత్సరాల వయసు గల ఆవిడను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఆమె చికిత్స పొందుతూ మృతి చెందినది ఈమె పూర్తి వివరాలు తెలియకున్నది కావున ఎవరైనా ఆమెకి తెలిసినవారు గుర్తించి బంగారుపాళ్యం పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు

నాటు సారా స్వాధీనం
నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - రొంపిచర్ల: అక్రమంగా తరలిస్తున్న పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు రొంపిచర్ల ఎస్ఐ మధుసూదన్ తెలిపారు. రొంపిచర్ల మండలం మోట మల్లెల గ్రామం ఆదినవారిపల్లె బస్ స్టాప్ దగ్గర సోమశేఖర్(33) శుక్రవారం ఒక సంచిలో క్యాన్ పెట్టుకుని ఉండగా అనుమానం వచ్చి తనిఖీ చేయగా 1500 రూపాయలు విలువచేసే నాటు సారాను కలిగి ఉండడంతో అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. నిందితుడుపై కేసు నమోదు చేసి పీలేరు కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ మధుసూదన్ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా నాటు సారా తయారుచేసినా, విక్రయించిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు రహస్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని అన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు వితరణ

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ గట్టు వారి పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో 55 మంది విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన బాలన్న గారి గురు శాంతమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమార్తె భాగ్యలక్ష్మి, అల్లుడు నాగరాజా విద్యార్థులకు మధ్యాహ్న భోజన స్టీల్ ప్లేట్లను శుక్రవారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే సుబ్రహ్మణ్యం, విశ్రాంత ఉపాధ్యాయులు మదన్మోహన్, సిబ్బంది శ్రీనివాసులు, శ్రీదేవి, గంగాధరం, రాజశేఖర్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సేవకు డాక్టరేట్ గుర్తింపు

ప్రజాశక్తి-కుప్పం: 40 ఏళ్ల గా ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటూ ప్రజలకు ఎంతో సేవ చేసిన టీడీపీ సీనియర్ నేత గోపినాథ్‌కు ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమిక్ వారు గౌరవ డాక్టరేట్ అందించడం ప్రజాసేవకు గుర్తింపు లాంటిదని టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు వెంకటేష్ పేర్కొన్నారు. గౌరవ డాక్టరేట్ అందుకున్న గోపినాథ్ ను శుక్రవారం టిడిపి నేతలు అభినందించారు. ప్రజాసేవ చేసే ఎంతో మందికి గోపినాథ్ స్ఫూర్తిగా నిలిచారని పలువురు అభినందిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ సత్యేంద్ర శేఖర్, కౌన్సిలర్లు జాకీర్, సోమశేఖర్, ఎమ్మార్ సురేష్,మాజీ గంగమ్మ గుడి చైర్మన్ ఆర్ రవి, విస్తరణ కమిటీ సభ్యుడు మంజునాథ్, క్లస్టర్ ఇన్‌చార్జ కన్నన్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కంపోస్ట్ యార్డు తనిఖీ

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ పరిధిలో గొబ్బిళ్ళ గోటూరులోని కంపోస్ట్ యార్డును మున్సిపల్ కమిషనర్ ఎన్వి రమణా రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణను పరిశీలించారు. పురపాలక సంఘ పరిధిలో తడి, పొడి చెత్త సేకరణ, నిర్వహణ, రవాణాలపై వార్డులలో తనిఖీలు నిర్వహించారు. సంబంధిత వార్డు శానిటేషన్ సెక్రెటరీలకు, పారిశుధ్య సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. పట్టణ ప్రజలు తడి చెత్త పొడి చెత్తను విడివిడిగా పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ఇఎల్ఎస్ఆర్ ట్యాంకు ను తనిఖీ చేసి నీటి స్వచ్ఛత పై (క్లోరిన్) టెస్ట్‌ను చేశారు. నీటి బోర్లలో ఉన్న నీటి సామర్థ్యాలను, నీటి లభ్యతలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఓవర్ హెడ్ ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి పట్టణ ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ పరిశీలన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని 37వ డివిజన్లో నిత్యవసర సరుకుల పంపిణీ డివిజన్ ఇన్‌చార్జ షణ్ముగం శుక్రవారం పరిశీలించారు. తెల్ల రేషన్ కార్డుదారులకు అందిస్తున్న బియ్యం, గోధుమపిండి, చక్కెర లబ్ధిదారులకు అందిస్తున్న విధానాన్ని పరిశీలించిన తర్వాత ఆయన మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పేదలకు బియ్యం, గోధుమపిండి, చక్కెర పంపిణీ విధానం సక్రమంగా జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ సంచుల నిషేధాన్ని ప్రజలందరూ పాటించాలని కోరుతూ కత్తర్ బ్యాగులను ఉచితంగా సరఫరా చేశారు.

పారిశుధ్య పనులు ముమ్మరం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని సంత బైలు గ్రామ పంచాయతీ పారిశుధ్య పనులు చేపట్టారు. శుక్రవారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త కుప్పలు, పేడ దిబ్బలు, శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సంతబయలు సర్పంచ్ రాజేశ్వరి, పెద్దిరెడ్డి పంచాయతీ కార్యదర్శి పి ఉమాశంకర్ పాల్గొన్నారు.



టిడిపి కార్యకర్తలను సన్మానిస్తున్న టిడిపి ఇన్‌చార్జి చల్లా రామచంద్రరెడ్డి

టిడిపి కార్యకర్తలకు సన్మానం

ప్రజాశక్తి- రొంపిచర్ల: టిడిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉత్తమ కార్యకర్తల సన్మాన కార్యక్రమాన్ని పుంగనూరు నియోజకవర్గం రొంపిచర్ల మండలంలో శుక్రవారం నిర్వహించారు. సుపరి పాలనలో ఉత్తమ కార్యకర్తలుగా ఎన్నికైన కార్యకర్తలకు నియోజక వర్గ టిడిపి ఇన్‌చార్జి చల్లా రామచంద్ర రెడ్డి శాలువాలు కప్పి మొమెంటులో అందించి అభినందించారు. వీరిని ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని ఆ పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు చౌడేపల్లి, సోమల, పులిచర్ల, రొంపిచర్ల, మండలాల నుంచి ఉత్తమ కార్యకర్తలు, మండలాల ముఖ్యమైన నాయకులు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్ : కార్యకర్తలకు గుర్తింపు తెచ్చిన టిడిపి మాత్రమేనని, కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఇవ్వడంలో తమ పార్టీ ముందుంటుందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే వారి కార్యాలయం ప్రజా దర్బార్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఉత్తమంగా పనిచేసిన కార్యకర్తలకు 'ఉత్తమ కార్యకర్త' సర్టిఫికెట్లను ఎమ్మెల్యే ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' విజయవంతంగా సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విజయాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో కృషిచేసిన ప్రతి కార్యకర్తలు, నాయకులను అభినందించారు. మొత్తం 56 మందికి "ఉత్తమ కార్యకర్త" సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మాజీ జెడ్పిటిసి బాలాజీ నాయుడు, మాజీ ఎంపిపి దీపశ్రీ, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, రఘు, ప్రతాప్ నాయుడు, వెంకటేష్ యాదవ్, అనురాధ, మోహన్ రాజ్, శ్యామ్, కాజూరు బాలాజీ, మంజూష్, రాజశేఖర్, నీరజాక్షులు నాయుడు, బాలసుబ్రహ్మణ్య యాదవ్, క్లస్టర్, డివిజన్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ప్రధాన, అనుబంధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని ఎంఈఓ కార్యాలయంలో పిఆర్‌టియు టీచర్స్ యూనియన్ 2026 క్యాలెండర్ ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంఈవో ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్ రెడ్డి, చేతుల మీదుగా పి ఆర్‌టియు 2026 క్యాలెండర్, డైరీ, స్టిక్కర్స్‌లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గంగాధర నెల్లూరు మండల పిఆర్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నకేశవరెడ్డి, పురుషోత్తం, పిఆర్‌టియు గౌరవ అధ్యక్షులు గంగాధరం, పిఆర్‌టియు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు రాజేంద్రరెడ్డి, చలపతి, దేవేంద్ర, చంద్రశేఖర్ శెట్టి , మోహన్ రెడ్డి, పవన్, కమలాకర్ రెడ్డి, సుధాకర్, రాజేష్, పలువురు టీచర్లు పాల్గొన్నారు.



దోసె పోసి టిఫిన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

టిఫిన్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాజకీయ నాయకులు సాధారణంగా ఎన్నికల ప్రచారంలో టీ చేయడం, దోసెలు వేయడం వంటివి చేస్తుంటారు. కానీ చిత్తూరు ఎమ్మెల్యే ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఎన్నికల సమయం కాకపోయినా, రాజకీయాలు పక్కనపెట్టి జీవితంలో ఎదగాలనుకునే వారికి అండగా నిలుస్తున్నారు. సామాన్య కార్యకర్త చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద టిఫిన్ స్టాల్ ఏర్పాటు చేయగా శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రారంభించారు. కార్యకర్తకు భరోసా ఇచ్చారు. సరదాగా కాసేపు దోసెలు వేశారు. అప్పడాలు వేయించారు. పలువురికి టిఫిన్లు వడ్డించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్స్ స్వైర విహారం

- వృద్ధురాలి మెడలో చైను అపహరణ
- భయాందోళనలో ప్రజలు



ప్రజాశక్తి -సోమల: చైన్ స్నాచర్స్ శుక్రవారం స్వైర విహారం చేసి ఓ వృద్ధురాలి మెడలో చైను లాక్కెళ్లారు. దీంతో ఏసమయానికి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని సోమల మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

సోమల శెట్టి వారి వీధికి చెందిన గన్నా రెడ్డమ్మ (65) పిండి మర వేయించడానికి మిరపకాయలు, దనియాలు తీసుకుని సాయిబాబా గుడి వెనుక ఓవర్ హెడ్ ట్యాంక్ వీధి వైపు ఒంటరిగా నడుచుకుంటూ వెళుతుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని బంగారు చైను వెనుక వైపు నుండి లాక్కుని పరారయ్యారు. బాధితురాలి కథనం మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల 30 నిమిషాల ప్రాంతంలో తాను పిండి మర వేయించుకునేందుకు వెళుతూ ఉండగా ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు వచ్చారని వారిలో వెనుక వైపు ఉన్న యువకుడు దిగి తన మెడలోని బొట్టు చైను(27 గ్రాముల)ను వెనుక వైపు నుండి లాగాడని చైను తెగిపోయి కింద పడిపోయిందని ఆ సమయంలో తాను గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు విని వచ్చేలోపు కింద పడ్డ చైనును దుండగుడు తీసుకుని ద్విచక్ర వాహనం ఎక్కి పరారయ్యాడని తెలిపింది. ఈ సంఘటన నుండి తేరుకొని తన కుమారుడికి సమాచారం అందించానని దొంగల కోసం వీధులన్నీ వెతికినా కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. దొంగలు లాకెళ్లిన బంగారు చైను దాదాపు 3 లక్షలకు పైగా విలువ చేస్తుందని తాను వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తు న్నానని, జరిగిన విషయాన్ని పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

భయాందోళనలో ప్రజలు.

మండల కేంద్రమైన సోమల నడిబొడ్డున చైన్ స్నాచింగ్ జరిగిన విషయం గ్రామంలో తెలియడంతో ప్రజలు మహిళలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో అధిక శాతం వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉంటారు. మహిళలు, చిన్నారులు తమ పొలాలకు వెళ్లేటప్పుడు ఇలాంటి సంఘటనలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించుకుంటున్నారు.

ప్రజా దర్బార్‌కు 'సమస్యల వెల్లువ'

- ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించండి
- అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

ప్రజాశక్తి -యాదమరి: ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే మురళీమోహన్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కలికిరి మురళి మోహన్ పాల్గొన్నారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీని ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రతి సమస్యకు సకాలంలో పరిష్కారం చేస్తామని ప్రజలకు తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రజలకు రైతులకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించారు. గతంలో నిర్వహించిన సర్వే సమస్యలు సుడిగుండంగా మారిందని అలాంటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటికే రీ సర్వే ప్రారంభమైందని ప్రజలందరూ సహకరించి సర్వే సక్రంగా నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. మండలంలో కొన్ని పంచాయతీల్లో రీ సర్వే ప్రారంభమైనదని దీని ఆధారంగా సుమారు 400 పైగా పాస్ బుక్ పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఇప్పుడు కొంతమందికి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. దీన దయాల్ అనే స్వచ్ఛంద సేవా సంస్థ చెవులు వినపడని వారికి మిషన్ ఉచితంగా పంపిణీ చేస్తారని సుమారు మిషన్ ధర 25 వేలకు పైగా ఉంటుందని ఎంతమందికి అవసరమైతే అంత మందికి ఉచితంగా ఇస్తామని తెలిపారు. మాధవరం పంచాయతీలో ఎనిమిది మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా పాస్ బుక్ పంపిణీ చేశారు. ఈ సమావేశంలో యాదమరి టిడిపి అధ్యక్షులు మొరార్జీ, కార్యదర్శి రవి, జిల్లా అధికార ప్రతినిధి హేమగిరి చిట్టి తహశీల్దార్ పార్థసారధి, ఎంపీడీవో పెంచల వీరేంద్ర అమరనాథ్ నాయుడు, చిత్ర నాయుడు, మహబూబ్ బాషా, ఏపిఎం ఈశ్వరి , ఏపీవో సంధ్యారాణి, జిల్లా కార్యదర్శి ధరణి, ప్రకాష్ ఎత్తు రాజులు, స్వతంత్ర కుమార్ రవి, మొదలియార్, గుణశేఖర్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజ్, మోహన్ మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సమస్యలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

30 వరకు రహదారి భద్రత మాసోత్సవాలు

ప్రజాశక్తి -విజయపురం (నగరి): ఈ నెల 30వ తేదీ వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహి స్తున్నట్లు మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ వాసుదేవరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ అఖిల భారత స్థాయి రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా రోడ్డు వినియోగదారులు, ఆటో రిక్షాలు, తేలికపాటి గూడ్స్ వాహనాలు, భారీ వస్తువుల వాహనాలు, బస్సులు, స్కూలు బస్సులు, టాక్సీ క్యాబ్‌లు, ట్రేకర్ ట్రైలర్‌లు, ద్విచక్ర వాహన దారులు వంటి అన్ని వర్గాల వాహ నాల సంఘాలకు అవ గాహన కల్పిస్తామన్నారు. అవ గాహన ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే వారోత్సవాల ఉద్దే శమ న్నారు. ఈ నెల పొడ వునా ప్రజలకు, పాఠశాల పిల్లల కు, పాఠశాల బస్సుల డ్రైవర్లు, సిబ్బందికి అవగాహన కల్పిస్తామన్నారు.

నేడు చేపల చెరువుల వేలం

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం పేటూరు, అన్నేమ్మ గారి పల్లి పంచాయతీల పరిధిలోని చేపల చెరువుల వేలం పాటలు సర్పంచి గ్రామస్తులు మండల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శులు జగదీష్, హరీష్ కుమార్ రెడ్డి తెలిపారు. పేటూరులో ఉదయం 11 గంటలకు అన్నెమ్మ గారి పల్లిలో మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు పంచాయతీ కార్యాలయాల వద్ద వేలం పాటలు నిర్వహిస్తామని పంచాయతీ యాక్ట్ నియమ నిబంధనలకు లోబడి ధరావత్తు చెల్లించిన వారు వేలం పాటలలో పాల్గొనవచ్చునని తెలిపారు.





నల్ల గంగమ్మ దర్శనానికి వెళ్లి వస్తూ

రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి - ఇద్దరు పరిస్థితి విషమం
- ఎనిమిది మందికి గాయాలు

ప్రజాశక్తి -పుంగనూరు : నల్ల గంగమ్మ ఆలయానికి వెళ్లి మొక్కు తీర్చుకుని తిరుగు ప్రయాణంలో జాతీయ రహదారిపై చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. పుంగనూరు పట్టణం జే టౌన్ సర్కిల్లో జరిగిన ప్రమాద వివరాలను అర్బన్ సీఐ సుబ్బరాయుడు శుక్రవారం వివరించారు.. రామసముద్రం మండలం చెంబకూరు దిన్నిపల్లి హరిజనవాడకు చెందిన 11 మంది ఆటోలు పెద్దపంజాణి మండలం వీరప్పల్లి వద్ద నల్ల గంగమ్మ ఆలయానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పట్టణానికి సమీపంలోని జాతీయ రహదారి జే టౌన్ సర్కిల్లో పెద్దపంజాణి మండలం నుంచి పుంగనూరు పట్టణంలోకి క్వాలిస్ వాహనం వస్తూ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ రెడ్డప్ప (56) తలకు బలమైన గాయం కావడంతో ఘటనా స్థలంలోని మృతి చెందాడు. నారాయణమ్మ, నారాయణప్ప ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో రాజమ్మ, కదిరప్ప, లక్ష్మీపతి, గాయత్రి, రూప శ్రీ, లావణ్య, రెడ్డెమ్మ, లాస్య, శరణ్యలకు గాయాలు అయ్యాయి. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భూ రీ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలంలోని 13 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే నిర్వహించేందుకు ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇవ్వడంతో శుక్రవారం తహశీల్దారు ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో రీ సర్వే ప్రారంభమైంది. తొలి విడతగా మూడు రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే చేపట్టారు.ఈ సందర్భంగా కమ్మనపల్లి రెవెన్యూ పరిధిలోని రైతులతో కలిసి తహశీల్దార్ ప్రసన్నకుమార్ పూజలు నిర్వహించి సర్వే ప్రక్రియను ప్రారంభించారు. భూముల విస్తీర్ణంపై స్పష్టత తీసుకురావడం, పట్టా పాస్‌బుక్‌ల్లో ఉన్న లోపాలను సరిదిద్దడం లక్ష్యంగా ఈ రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు తెలిపారు. రీ సర్వే ద్వారా తమ పట్టా పాస్‌బుక్‌ల్లో సరైన విస్తీర్ణం నమోదు అవుతుందని అధికారులు వివరించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కిషోర్, మండల సర్వేయర్ నరేంద్ర, ఆర్ఐ దాము, విఆర్వోలు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.



పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి -సోమల: ప్రభుత్వం నూతనంగా గవర్నమెంట్ లోగోతో కూడిన పట్టాదార్ పాసు పుస్తకాలను సదుం మండలంలోని 79ఎ చింతమాకులపల్లి, అమ్మగారి పల్లి పంచాయతీలలో తహశీల్దారు ప్రమీల, పిఎసిఎస్ చైర్మన్ సునీల్ కుమార్ రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. రెవెన్యూ గ్రామసభల నిర్వహణలో భాగంగా నిర్వహించిన రెండు పంచాయతీలలో దాదాపు 130కి పైగా పాసు పుస్తకాలను ఈ కేవైసీ చేసి రైతుల వేలిముద్రలు తీసుకుని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిటి కిషోర్, విఆర్ఓ మహబూబ్ బాషా, అక్బర్ బాషా రైతులు పాల్గొన్నారు.